# ఎదురు నీడ

కాలింగ్‌బెల్ నొక్కాను. లోపల బెల్ మోగుతున్న చప్పుడు వినిపించలేదు. మరోసారి నొక్కాను. శబ్దం లేదు. తలుపు తట్టబోతూ ఆగాను. తలుపు బయట తాళం వేసి ఉంది. సిటీబస్‌లో గంటన్నర పైగా ప్రయాణం చేసి వచ్చిన నాకు నిరుత్సాహం వేసింది. ఆదివారం కాబట్టి గంగాధర్, అతని భార్య సుమతి ఇంట్లోనే ఉంటారనుకున్నాను. గడచిన సంవత్సరం న్నర నుండి సుమతితో మాట్లాడి గంగాధర్ గురించి కొన్ని సంగతులు చెప్పాలని అనుకోవడం అనుకోవడంగానే మిగిలి పోయింది. ఎప్పుడో చెప్పి ఉండాల్సింది.

చివరకు ఇవాళ నాకు తీరిక చిక్కి వస్తే ఎదురైన పరిస్థితి ఇది.

ఏం చేయాలో తోచలేదు. వాళ్ళు ఆ ఇంట్లో ఉంటున్నారో లేక ఇల్లు ఖాళీ చేసి వేరే ఇంట్లోకి మారారో పక్కిళ్ళ వాళ్ళను అడిగితే గాని తెలియదు. మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోంది. ఎండ చిక్కగా ఉంది. వెనక్కి తిరగబోతుంటే కిటికీ రెక్క తెరచిన చప్పుడయింది. ఆగి కిటికీ వైపు చూశాను. కిటికీలోంచి నన్ను పరీక్షగా చూస్తున్న సుమతిని గుర్తుపట్టాను. మనిషి చాలా మారిపోయింది. ఏమయిందో ఏమో సన్నగా అయింది. దవడలు పీక్కుపోయి ఉన్నాయి. గంగాధర్ తన గురించే గాని ఎదుటి వ్యక్తి గురించి ఎప్పుడూ పట్టించుకోడు. నాతో స్నేహం చేసేప్పుడు అలానే ప్రవర్తించేవాడు. సుమతిని ఇంట్లో ఉంచి తలుపు తాళం ఎందుకు వేశాడో నాకు అర్థం కాలేదు. అతను శాడిస్టుగా తయారయ్యాడా? సుమతి నన్ను గుర్తుపట్టిందో లేదో? పలకరిద్దామనుకునేంతలో కిటికీ రెక్క మూసుకుపోయింది. మనసు చివుక్కుమంది. నాతో మాట్లాడడం ఆమెకు ఇష్టం లేదా? వాళ్ళ పెళ్ళికి ముందు అతను నాతో స్నేహం కన్నా ఎక్కువగా మెలిగాడని తెలిసిందా?

అయిదు సంవత్సరాల కిందటి వరకు గంగాధర్ ఆఫీసులో పనిచేశాను. మా ఇద్దరి సీట్లు పక్కపక్కనే ఉండేవి. అతనితో మంచిగా తర్వాత దగ్గరగా ఉన్నాక కాళ్ళు వెనక్కి తీసుకోవడం కష్టమైపోయింది. నాకంటే అతను పది సంవత్సరాలు పెద్ద. తనకు అప్పటికే పెళ్ళయి పిల్లలున్న సంగతి నాలుగు సంవత్సరాలపాటు దాచిపెట్టాడు. అక్కడితో మా సంబంధం తెగిపోయింది. ఇటువంటి సంబంధాలు శతృత్వంతో మిగిలిపోతాయి. జరిగిందదే. రామానుజం అన్ని విషయాల్లో గంగాధరానికి భిన్నంగా ఉండేవాడు. అతన్ని అర్థం చేసుకుని మసలుకునేలోపల నాకో బాబు పుట్టి చనిపోయాడు. ఆ చనిపోవడం కూడా ఒక మిస్టరీ. ఏమయిందో, ఎందుకయిందో నాకింతవరకు తెలియదు. నా భర్తను ఎన్నోసార్లు అడిగాను. చెప్పలేదు. తెలియదని అనుకోలేదు. అతను నాతో చాలా తక్కువగా మాట్లాడేవాడు. అన్నీ అమరి ఒంటరిగా ఉన్నట్టు అనిపించేది. మేమిద్దరం రెండున్నర సంవత్సరాలు కాపురం చేసి ఉంటాం. ఆ తర్వాత ఎవరికీ చెప్పాపెట్టకుండా ఉద్యోగం మానేసి ఎటో వెళ్ళిపోయాడు. బతికి ఉన్నాడో, లేడో కూడా తెలియదు. అతని ఆఫీసులో నాకు ఉద్యోగం ఇచ్చారు. అతను నన్ను వదిలి వెళ్ళిపోవడానికి కారణం గంగాధర్ అని నా అనుమానం. అతను వెళ్ళిపోయిన ముందు రోజుల్లో నా భర్తకు చాలా దగ్గరయ్యాడు. నా గురించి ఉన్నవీ, లేనివీ నా భర్తకు చెప్పి ఉండొచ్చు. నా భర్త

మనసు విరిగిపోవడానికి కారణం కావడం అదే అయి ఉంటుంది. నా జీవితం అస్తవ్యస్తం అయిపోవడానికి గంగాధర్ ఎందుకలా చేశాడు? ఎన్నోసార్లు అతనికి ఫోన్ చేసి అడుగుదామనిపించింది. అడిగినా నిజం ఒప్పుకుంటాడనే నమ్మకం లేదు. చెట్టుమీంచి ఆకు పడినంత తేలికగా అబద్ధం చెప్పగలడు. నేనూ గంగాధర్ కలిసి దిగిన ఫోటోలు నా భర్త చేతికి ఎలా వచ్చాయో ఇప్పటికీ నాకు అర్థం కాని సంగతి. గంగాధర్ మీద ఏవిధంగా ప్రతీకారం తీర్చుకోవాలా అని ఎన్నోసార్లు ఆలోచించాను. చివరకు ఈ ఆలోచన వచ్చింది. అతని మీద కక్ష తీర్చుకునేవరకు నా మనసు శాంతించదు. అతని సంసారం జీవితం సుఖంగా ఉండకూడదు. అంతే.

ఇంటివెనక ఉన్న తలుపు నెట్టాను. తలుపు తెరుచుకుంది. వెనకపక్క నుండి నేను ఇంట్లోకి వస్తానని సుమతి అనుకుని ఉండదు. చేతులు కట్టుకుని బల్లకు ఆనుకుని నిలబడి ఉంది. మడత కుర్చీలో గంగాధర్ శాలువా కప్పుకుని పడుకున్నవాడల్లా నన్ను చూసి లేచి కూర్చున్నాడు. అతను మునుపు ఎలా ఉండేవాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. సుమతితో ఎన్నో విషయాలు చెబుదామని వచ్చినదాన్ని టాపిక్ ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడం లేదు. నేను ఎందుకు వచ్చానో అతను ఊహించి ఉంటాడనుకుంటాను. అయినా ముఖంమీద నవ్వు చెరగలేదు. ఒకప్పుడు ఆ నవ్వుకోసమే నా జీవితాన్ని పోగొట్టుకున్నాను. ఇప్పుడు పోగొట్టుకోవడానికి ఏమీ మిగల్లేదు. పిల్లలు ఇంట్లో ఉన్నట్టు అనిపించడంలేదు.

మనసుని కూడగట్టుకుని సుమతి ముఖంలోకి చూస్తూ "మీతో ఒక సంగతి చెబుదామని వచ్చాను" అన్నాను. నేను పిరికి వ్యక్తినేం కాదుగాని ధైర్యస్తురాలినేం కాదు. గట్టిగా మాట్లాడాలని అనుకున్నంత గట్టిగా మాట్లాడలేను. "చెప్పండి" అన్నట్టు తలూపింది. ఈ అవకాశాన్ని నేను వదులుకోలేదు. అతనికీ నాకు ఎలా పరిచయం అయి ఎక్కడవరకు వెళ్ళిందో ఏ ఒక్కమాటా, ఏ ఒక్క సంఘటనా వదిలిపెట్టకుండా అతను నా సంసారంలో ఏ విధంగా చిచ్చుపెట్టాడో అరగంటపాటు ఏకధాటిగా చెప్పాను. చివర్లో దుఃఖం ఆపుకోలేక ఏడ్చేశాను. అతనివైపు చూడడానికి నాకు ఇష్టం అనిపించలేదు. నేను ఆమెకు అన్నీ పూసగుచ్చినట్టు చెబుతోంటే నా మాటలకు అడ్డు తగలలేదు. చివరకు నా హేండ్‌బేగ్‌లోంచి అతను నాకు రాసిన ఉత్తరాలు, మేమిద్దరం కలిసి దిగిన ఫోటోలు ఆమెకిచ్చాను. ఆమెకు మా సంగతి నేను చెప్పేవరకు తెలియదనుకుంటాను. చెబుతున్నప్పుడు ముఖమంతా కోపపు గుట్టలా అయింది. అదిచాలు. నేను వచ్చిన పని పూర్తి అయింది. అక్కడ ఉండడం

అనవసరం అనిపించింది. బయటకు వచ్చి రోడ్డు మీదకు రాబోతుంటే వాళ్ళ పనిమనిషనుకుంటాను, నాకు ఎదురై, నావంక ఎగాదిగా చూస్తూ, "ఎవరు కావాలమ్మా" అడిగింది.

ఆగాను.

"సుమతి కోసం వచ్చాను" అన్నాను.

"సుమతమ్మ లేదుగా... ఆయమ్మ, వాళ్ళాయన గంగాధరం, పిల్లలూ కారు ప్రమాదంలో చచ్చిపోయి రెండు నెలలవుతోంది..."

నా కాళ్ళ కింది భూమి కదులుతున్నట్టు అనిపించసాగింది. ఇప్పటివరకు నేను ఎవరిని చూసింది, మాట్లాడింది? నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. పనిమనిషి పక్కకు వెళ్ళగానే కిటికీ రెక్క నెట్టి లోపలికి తొంగి చూశాను. నేను సుమతికి ఇచ్చిన ఉత్తరాలు, ఫోటోలు దుమ్ముకొట్టుకుపోయిన బల్లమీద ఉన్నాయి. మడత కుర్చీలో గంగాధర్ లేడు. ఖాళీగా ఉంది. గదిలో సుమతి లేదు. వెనక గది తలుపు గడియపెట్టి ఉంది.

***–తేజ వీక్లీ, 21 నవంబర్, 2008***